సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 20 । మార్చి । 2023



సర్కారు బడుల్లోనూ సీబీఎస్ఈ

ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఈ మేరకు పశ్చిమగోదావరి జిల్లాలో 16 హైస్కూళ్లను ఎంపిక చేశారు. 8లో



బీసీల కులగణన చేపట్టాలి

బీసీల కులగణనను సమగ్రంగా చేపట్టాలని బీసీ చైతన్య వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ కోరారు. ఏలూరులో సమావేశం నిర్వహించారు. 8లో

పిట్ట కొంచెం.. మనుగడ గగనం



పిచ్చుకలకు సరైన ఆవాసాలు లేక వాటి మనుగడ ప్రశార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన పక్షి ప్రేమికులు వాటి సంరక్షణకు చర్యలు తీసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

సత్యదేవుని క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: అన్నవరం సత్యదేవుని 2023 క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదివారం ఆవిష్కరించారు. దేవస్థానం పాలకమండలి సభ్యులు బొద్దాని విజయలక్ష్మి, బొద్దాని శ్రీనివాసు దంపతులు స్వామి పేరున ఐదు వేల క్యాలెండర్లను ముద్రించి ఉప ముఖ్యమంత్రి కొట్టు చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి సీఎం జగన్ వేల కోట్లు నిధులు మంజూరు చేస్తున్నారని, అర్చకులకు నెలవారీ వేతనాలు అందిస్తున్నారన్నారు. విజయవాడ దుర్గమ్మ దేవస్థానం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ముఖ్యమంత్రి చిత్తశుద్ధిని చూపారన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, నగరం కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, చింతకాయల సత్యనారాయణ, బోళెం రమణ, దస్తగిరి, చింతా శ్రీనివాసు, వైబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

హస్తకళలను ప్రోత్సహించాలి



ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్) : హస్తకళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. స్థానిక మావుళ్లమ్మవారి ఆలయం వద్ద ఐఎంఏ హాలులో ఏర్పాటు చేసిన హస్తకళల ప్రదర్శనను ఆదివారం ఆమె తిలకించారు. ప్రతి ఒక్కరూ హస్తకళల ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. నిత్యం మనం వినియోగించే వస్తువులు, లేసు ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారన్నారు. హస్తకళలను ప్రోత్సహించేలా ఆయా రంగాల వారికి శిక్షణ ఇవ్వడం, బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు, డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్ ఉన్నారు.

'భారత్' గౌరవ్ రైలుకు మంచి స్పందన



ఏలూరు నుంచి రైలులో బయలుదేరిన ప్రయాణికులు

ఏలూరు (టూటౌన్) : ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ప్రారంభమైన మొదటి భారత్ గౌరవ్ రైలుకు శనివారం రాత్రి ఏలూరు, పరిసర ప్రాంతాల పర్యాటకుల నుంచి మంచి స్పందన లభించింది. పుణ్యక్షేత్ర యాత్రలో పూరి–కాశీ–అయోధ్యకు ప్రయాణించేందుకు ఏలూరు రైల్వేస్టేషన్ నుంచి 14 మంది యాత్రికులు భారత్ గౌరవ్ రైలు ఎక్కారు. రైలుకు ఏలూరు స్టేషన్‌లో ఘన స్వాగతం లభించింది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని చాటిచెప్పేలా రైల్వేశాఖ భారత్ గౌరవ్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ఈ రైలును ప్రారంభించింది.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ థియరీ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభించనున్నట్టు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో వాల్యూయేషన్ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న సంస్కృతం అధ్యాపకులను నియమించామని, ప్రిన్సిపాళ్లు తమ కళాశాల లాగిన్‌ను చూసి ఆయా అధ్యాపకులను రిలీవ్ చేయాలని ఆదేశించారు. సదరు అధ్యాపకులు మధ్యాహ్నం 12 గంటలకు ఏలూరులోని తమ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. తొలుత సంస్కృతం పేపర్ల మూల్యాంకనం ప్రారంభమవుతుందన్నారు.

బలమైన అభ్యసనకు ట్యాబ్‌లెట్

ఏలూరులోని సత్రంపాడు హైస్కూల్‌లో ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు నేర్చుకుంటున్న విద్యార్థినులు



డిజిటల్ చదువులు

- విద్యార్థుల్లో పెరిగిన ఆసక్తి
- బైజూస్ పాఠాలతో సత్ఫలితాలు
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- ఉమ్మడి జిల్లాలో అభ్యసనా సామర్థ్యాలు మెరుగు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థికి కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చదువుల విప్లవానికి శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా పలు సంస్కరణలు తీసుకువచ్చారు. దీంతో ప్రభుత్వ విద్యారంగ ప్రస్థానం అంచెలంచెలుగా ఉన్నత శిఖరాల వైపు బలంగా దూసుకుపోతోంది. విద్యార్థులు భౌతికంగా బలవంతులుగా, ఆరోగ్యవంతులుగా తయారు కావడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని జగనన్న గోరుముద్ద పేరిట సమూలంగా మార్చేశారు. అలాగే విద్యార్థులు మానసికంగా, అభ్యసనపరంగా మరింత బలంగా తయారు కావడానికి వారికి 'ట్యాబ్'లెట్‌లను అందించింది ఈ ప్రభుత్వం. దీంతో విద్యార్థులు తాము అప్పుడే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అయిపోయామనే స్థాయిలో గర్వంగా చదువుపై దృష్టి సారిస్తున్నారు.

విద్యార్థి స్థాయి నుంచే..

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ప్రభుత్వం ట్యాబ్‌లు అందించింది. దీనిద్వారా వారిలో చదువుపై ఆసక్తి పెంచడంతో పాటు విజ్ఞానంపై జిజ్ఞాస పెరిగేలా చేస్తోంది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతపై విద్యార్థి స్థాయి నుంచే అవగాహన పెంచడానికి ట్యాబ్‌లతో విద్యా బోధన ఉపయోగపడుతోంది. **అంతర్జాతీయ స్థాయి** బోధనలో వినూత్న **ఆలోచనలతో వెళుతున్న బైజూస్** సంస్థతో ఒప్పం**దం చేసుకుని ఇప్పటివరకూ** కేవలం కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన విద్యను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేరువ చేసింది.

సాంకేతిక బాటలో..

గతంలో కేవలం బ్లాక్ బోర్డులకే పరిమితమైన విద్యాబోధనను ప్రభుత్వం సరికొత్త పుంతలు తొక్కిస్తూ సాంకేతిక బాట పట్టిస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన ఇంగ్లిష్ ల్యాబ్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం, డిజిటల్ క్లాస్ రూములు అందుబాటులోకి తీసుకువచ్చి ఎల్ఈడీ ప్రొజెక్టర్ల ద్వారా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పాఠాలను వివరించడం వంటివి జరుగుతున్నాయి. వీటన్నింటికీ తలమానికంగా విద్యార్థుల చేతికి ట్యాబ్‌లు ఇచ్చి పాఠాలను వివరించడం అంతటా ఆకట్టుకుంటోంది. విద్యార్థుల్లో సాంకేతిక ఆలోచనలతో పాటు వారిలోని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతోంది.

కనెక్ట్ అవుతున్నారు



ట్యాబ్‌ల ద్వారా బోధనకు విద్యార్థులు బాగా కనెక్ట్ అవుతున్నారు. ఉపాధ్యాయులను సందేహాలు అడగలేని వారు కూడా బైజూస్ ద్వారా అనుమానాలను నివృత్తి చేసుకుంటున్నారు. విద్యారంగంలో వచ్చిన వినూత్న మార్పులు విద్యార్థులకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నాయి. ట్యాబ్ పాఠాలు విద్యార్థులకు సులభంగా అర్థమవుతున్నాయి.

– సబ్బితి నరసింహమూర్తి, మండల విద్యాశాఖాధికారి, ఏలూరు

బోధన ఆకట్టుకునేలా..



డిజిటల్ విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను బాగా ఆకట్టుకుంటోంది. డిజిటల్ తరగతి గదులు ఆసక్తికరంగా ఉండటంతో పాటు ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలను అరచేతిలో పెట్టడం విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తిస్తోంది. పాఠ్యపుస్తకాల్లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసిన వెంటనే పాఠాలు స్క్రీన్‌పై ప్రత్యక్షం కావడం సరికొత్త అనుభూతినిస్తోంది.

– ఎన్‌వీ రవిసాగర్, జిల్లా విద్యాశాఖాధికారి, ఏలూరు

బైజూస్ కంటెంట్‌తో..

పాఠ్యపుస్తకంలోని పాఠాల కన్నా ట్యాబ్ పాఠాలపై విద్యార్థులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. రోజూ కనీసం రెండు పీరియడ్లతో పాటు ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తప్పనిసరిగా డిజిటల్ విధానంలో బోధించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బైజూస్ కంటెంట్‌తో అందుతున్న పాఠాలు విద్యార్థులను ప్రభావితం చేస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో ప్రభుత్వం ఖర్చు పెట్టిన ప్రతి రూపాయికీ న్యాయం జరిగి సత్ఫలితాలు సాధించే దిశగా విద్యార్థులు అడుగులు వేస్తున్నారనే విశ్వాసం వ్యక్తమవుతోంది.

ట్యాబ్‌ల పంపిణీ ఇలా..

జిల్లా	విద్యార్థులు	ఉపాధ్యాయులు
ఏలూరు	18,370	2,613
పశ్చిమగోదావరి	14,353	2,373
మొత్తం	32,723	4,986

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 32,723 మంది 8వ తరగతి విద్యార్థులకు, 4,986 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు అందించారు. డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు ముందుగానే ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

ఒక్కో ట్యాబ్‌పై రూ.30 వేల ఖర్చు

విద్యార్థులకు అందించిన ఒక్కో ట్యాబ్‌పై ప్రభుత్వం రూ.30 వేలు వెచ్చించింది. బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.20 వేలు ఉండే ట్యాబ్‌లను హోల్‌సేల్‌గా కొనుగోలు చేయడంతో ఒక్కో ట్యాబ్‌పై రూ.5 వేల వరకూ ఆదా అయ్యింది. అలాగే ట్యాబ్‌లో బైజూస్ పాఠ్యాంశాలు కలిగిన కంటెంట్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి, యాప్‌ను ప్రవేశపెట్టడానికి మరో రూ.15 వేల వరకూ ఖర్చు పెట్టింది. విద్యార్థులకు ఉన్నత సాంకేతికతతో బోధన అందించాలనే ఏకైక లక్ష్యంతో ట్యాబ్‌లను పంపిణీ చేశారు.

25న దెందులూరుకు ముఖ్యమంత్రి రాక

- 'వైఎస్సార్ ఆసరా' నగదు జమ
- భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల, ఎమ్మెల్యే కొఠారు
- అధికారులతో సమీక్ష



దెందులూరులో ముఖ్యమంత్రి సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహులల్‌దేవ్ శర్మ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 25న ఏలూరు జిల్లాలోని దెందులూరులో పర్యటించనున్నారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ మేరకు పర్యటన ఖరారైన నేపథ్యంలో ఆదివారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ, అధికారులు దెందులూరులో ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ ప్రాంగణాన్ని, బహిరంగ సభ వేదికలను పరిశీలించారు. దెందులూరులో హెలీప్యాడ్‌కు సీఎం జగన్ చేరుకుని అక్కడి నుంచి స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని బహిరంగ సభా వేదికకు చేరుకునేలా ఖరారు చేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎం పర్యటన నేపథ్యంలో గంగన్నగూడెంలోని శ్రీకృష్ణ కన్వెన్షన్‌లో జిల్లాస్థాయి, అధికారులు, పోలీసులు, మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్సీ తలశిల, ఎమ్మెల్యే కొఠారు, కలెక్టర్, ఎస్పీలు సమావేశమయ్యారు. సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం మాట్లాడుతూ సీఎం పర్యటన జయప్రదానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చిన్న పొరపాటుకు కూడా తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలను కేటాయించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ నియోజకవర్గానికి రానున్న ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం పలికేలా అందరి సమన్వయంతో భారీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు.

సమన్వయంతో ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు సీఎం సభా కార్యక్రమాన్ని పూర్తిగా పర్యవేక్షిస్తారని సంబంధిత విభాగాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ అధికారులు హెలీప్యాడ్ ఏర్పాట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీరు, విద్యుత్ శాఖ అధికారులు సభా ప్రాంగణానికి విద్యుత్ సౌకర్యం ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణను విద్యాశాఖ పర్యవేక్షిస్తుందని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మాట్లాడుతూ హెలీప్యాడ్ నుంచి సభావేదిక వరకూ బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక పార్కింగ్ జోన్‌లు గుర్తించి యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేస్తామని తెలిపారు. జెడ్పీ సీఈఓ రవికుమార్, ఏలూరు ఆర్డీఓ పెంచల కిషోర్, పార్టీ నాయకులు గంటా ప్రసాద్, నిట్టా నీలా నవకాంతం, దెందులూరు నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులు అప్రమత్తం

మత్స్యశాఖ ఏడీ రాజు సూచన



భీమవరం అర్బన్: బంగాళాఖాతంలో అల్పపీడన ఆవర్తనం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉండాలని భీమవరం మత్స్యశాఖ ఏడీ ఎల్ఎల్ఎన్ రాజు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో చేపలు, 40 వేల ఎకరాల్లో వనామీ రొయ్యల పెంపకం చేస్తున్నారని, ఉష్ణోగ్రతలు తగ్గి శీత గాలులు వీయడం వల్ల చెరువుల్లో పీహెచ్ శాతం తగ్గిపోతుందన్నారు. ఎకరానికి 25 కిలోల అగ్రికల్చర్ లైమ్ చల్లాలని, చెరువుల్లో ఏరియేటర్లు పెంచాలని సూచించారు. ఆక్సిజన్ శాతం పెంచేందుకు ఆక్సిజన్ ట్యాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మబ్బుల వల్ల రొయ్యలు మేత తినడం తగ్గిస్తాయని, చెక్ ట్రేలలో మేత వేసి అవసరమైన మేరకు అందించాలన్నారు. చెరువులు చల్లబడితే రొయ్యలకు వైట్‌స్పాట్, విబ్రియో, బ్యాక్టీరియా సోకడం, చేపలకు తాటాకు, ఎర్రమచ్చ తెగులు సోకడం, పేను పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

బలుసులమ్మకు పుట్టింటి పొన్పు ఉత్సవం



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఉగాది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మవారికి పాతూరులోని పుట్టింటి పార్కు వద్ద పొన్పు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి పుట్టింటి వారైన పాశం కాశీ విశ్వేశ్వరరావు దంపతులు, కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గరగలతో పొన్పు వేశారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువెళ్లారు. సోమవారం మధ్యాహ్నం పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కొట్టు అంజిబాబు తెలిపారు. ఉగాది వేడుకలకు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్.రంగనాయకులు, ఎ.రమేష్, జి.రామస్వామి తదితరులు పర్యవేక్షించారు.

నేడు నేపాల్ ఉప రాష్ట్రపతి రాక

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి (చినవెంకన్న) ఆలయాన్ని నేపాల్ ఉప రాష్ట్రపతి పరమానందజ్ఞ సోమవారం సాయంత్రం సందర్శించనున్నారు. ఈ మేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ఆయన కారులో ఇక్కడకు రానున్నారు.

దీవెనలు మెండుగా.. చదువుల పండుగ

- 33,527 మంది విద్యార్థులకు రూ.25.24 కోట్ల విద్యాదీవెన
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి



భీమవరం కలెక్టరేట్‌లో జగనన్న విద్యాదీవెన చెక్కును అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లాలో 33,527 మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన కింద రూ.25.24 కోట్ల లబ్ధి చేకూరిందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. ఆదివారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్టీఆర్ జిల్లా నుంచి ప్రారంభించిన ఈ పథకాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ నుంచి ఆమె వీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్న ఉద్దేశంతో జగనన్న విద్యాదీవెన ద్వారా ప్రోత్సహిస్తున్నారన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి తదితర కోర్సులు చదివే పిల్లలకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విద్యాదీవెన పథకం ద్వారా అందిస్తున్నామన్నారు. జిల్లాలో అక్టోబరు–డిసెంబరు 2022 త్రైమాసికానికి 35,527 మంది విద్యార్థులకు సంబంధించి రూ.25.44 కోట్ల మేర 29,891 మంది తల్లుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఎస్సీ వెల్ఫేర్‌కు సంబంధించి 5,507 మంది విద్యార్థులకు రూ.5.53 కోట్లు, బీసీ వెల్ఫేర్ 15,542 మందికి రూ.10.29 కోట్లు, ఈబీసీ వెల్ఫేర్ 3,240 మందికి రూ.2.70 కోట్లు, కాపు వెల్ఫేర్ 8,069 మందికి రూ.5.90 కోట్లు, ట్రైబల్ వెల్ఫేర్ 167 మందికి రూ.83 లక్షలు, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ 352 మందికి రూ.31 లక్షలు, క్రిస్టియన్ వెల్ఫేర్ 659 మందికి రూ.41 లక్షలు అందించామన్నారు. భీమవరం ఆర్డీఓ దాసి రాజు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారి డి.పుష్పరాణి, భీమవరం మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



యోగాసన పోటీ విజేతలు

తాడేపల్లిగూడెం రూరల్: యోగాసనాల విభాగం నుంచి మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. యోగాలో మూడు నెలల శిక్షణానంతరం ఆదివారం పోటీలు నిర్వహించగా సీహెచ్ సాహస్, ఆర్.యశ్వంత్, ఐ.సందీప్, బి.జశ్వంత్, సీహెచ్ అభిరామ్, యు.ఆదిత్యచరణ్, కె.నాగేంద్ర, జి.జయ రాజేష్, వి.వంశీ రికార్డు సాధించారు. రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి సాయిశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కోచ్ కళ్యాణ సుందరం పర్యవేక్షణలో పోటీలు జరిగాయి. విజేతలను ప్రిన్సిపల్ బి.రాజారావు, సిబ్బంది అభినందించారు.

వారెవ్వా.. వరి పువ్వు



వరి మొక్క నుంచి వచ్చే ధాన్యం గురించి అందరికీ తెలుసు. అయితే వరి పువ్వు గురించి చాలా మందికి తెలియదు. వరి పంట పొట్టదశలో ఉండగా ఈనిక తర్వాత పువ్వు వికసిస్తుంది. ఇది తక్కువ పరిమళాన్ని వెదజల్లుతుంది. ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల సమయంలో మాత్రమే వికసిస్తుంది. మూడు, నాలుగు రోజుల తర్వాత గింజ తయారీ మొదలవుతుంది. బియ్యపు గింజ పరిమాణంలో ఉంటూ ఇవి ఆకట్టుకుంటాయి.

– ఆకివీడు

క్లుప్తంగా

కుళ్లు రాజకీయాలు చంద్రబాబుకే చెల్లు



పట్టణంలో మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎమ్మెల్సీ ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఎద్దేవా చేశారు. తాడేపల్లిగూడెంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పనితీరు, అభివృద్ధి చూడలేక కుళ్లు రాజకీయాలు చేస్తూ బురద చల్లడం చంద్రబాబుకే చెల్లుతుందన్నారు. టీడీపీ దుష్పపాలనతో విసిగిన రాష్ట్ర ప్రజలు 151 సీట్ల భారీ మెజారిటీతో వైఎస్సార్‌సీపీని గెలిపించారన్న విషయం చంద్రబాబు మర్చిపోయినట్టు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

యలమంచిలి: మద్యం కోసం భార్య డబ్బులు ఇవ్వలేదని మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కాజ (పడమర)కు చెందిన తెంగెళ్ల నాగరాజు (45) మద్యానికి బానిసై డబ్బుల కోసం తరచూ భార్య గొడవపడేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భార్యను డబ్బులివ్వాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపంతో పురుగుమందు తాగాడు. అతనిని 108లో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె.విజయ నాగప్రసాద్ చెప్పారు.

సర్కారు బడుల్లోనూ సీబీఎస్ఈ

- వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతి నుంచి ప్రారంభం
- తొలిదశలో జిల్లాలో వసతులున్న 16 హైస్కూళ్ల ఎంపిక
- విద్యార్థుల్లో మరింత మెరుగుపడనున్న అభ్యసనా సామర్థ్యం



సీబీఎస్ఈ అమలుకు ఎంపికైన పాలకొల్లులోని బీవీఆర్ఎం మునిసిపల్ హైస్కూల్

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందడంతో పాటు మౌలిక వసతులు సమకూరడంతో గుర్తించిన కేంద్ర ప్రభుత్వం జిల్లాలో ఎంపిక చేసిన హైస్కూళ్లలో సీబీఎస్ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌ను అమలు చేయనుంది. 2023 – 2024 సంవత్సరం నుంచి 9వ తరగతి విద్యార్థులకు ఈ విద్యా విధానం ప్రారంభంకానుంది. దేశ వ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో రాణించాలన్నా, ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఇంజినీరింగ్ కోర్సులు చదవడానికి ప్రవేశ పరీక్షల్లో సత్తా చాటాలన్నా సీబీఎస్ఈ విద్య అభ్యసిస్తే సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు ఎక్కువ. ఇటువంటి సీబీఎస్ఈ విద్య కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. దీనిలో భాగంగా మొదటి విడతలో జిల్లాలో 16 పాఠశాలలను సీబీఎస్ఈకి ఎంపిక చేశారు. ఇప్పటికే నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి హంగులతో మెరుగైన విద్యను అందిస్తున్నారు. అంతేకాకుండా ఆంగ్ల విద్యకు శ్రీకారం చుట్టారు. ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు కార్యాచరణ చేపట్టారు. ప్రపంచస్థాయి పోటీని ఎదుర్కొనాలంటే విద్యార్థులకు సీబీఎస్ఈ విద్య చాలా ఉపయోగపడుతుంది. సీబీఎస్ఈ ద్వారా చదువుకునే విద్యార్థులు వారి కుల, ఆదాయ ధ్రువీకరణలు, పుట్టిన తేదీ సర్టిఫికెట్లను అందజేయాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ ద్వారా పరీక్షలు రాసే విద్యార్థులు ఐదు సబ్జెక్టులను మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

పాఠశాల ఎంపిక ఇలా..

సీబీఎస్ఈ విద్యా విధానం అమలు చేసేందుకు ఒక పాఠశాలను ఎంపిక చేయాలంటే పాఠశాల భౌతిక నిర్మాణం, తరగతి గదులు, ఆట స్థలం, ఉపాధ్యాయుల సంఖ్య, పాఠశాల ఆర్థిక నిర్వహణ, విద్యార్థుల సంఖ్య, విద్యార్థుల ప్రగతి, బాలబాలికలు, దివ్యాంగులకు సరిపడా టాయిలెట్స్ వంటి మౌలిక వసతులను పరిగణనలోకి తీసుకుంటారు.

ఎంపికైన పాఠశాలలు ఇవే

పశ్చిమగోదావరి జిల్లాలో వీరవాసరం, కొణితివాడ, ఆకివీడు, పెదకాపవరం, కోపల్లె, లంకలకోడేరు, తణుకు, ఏలూరుపాడు, ఉండి, కాళ్ల, మొగల్తూరు, దువ్వ, ఆచంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు పాలకొల్లు పట్టణంలో బీఆర్ఎంవీ మునిసిపల్ ఉన్నత పాఠశాల, ఎల్‌బీ చర్ల, ఆరుగొలనులో ఉన్న రెండు రెసిడెన్షియల్ పాఠశాలలను ఎంపిక చేశారు.

రాష్ట్రంలో సీబీఎస్ఈ ప్రాంతీయ కార్యాలయం

సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ప్రాంతీయ కార్యాలయం, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏపీలో ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌లో ఏపీ, తెలంగాణకు కలిపి ప్రత్యేకంగా ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 2023–2024 విద్యా సంవత్సరం నుంచి బోర్డు పరీక్షలను ఈ కార్యాలయం నిర్వహిస్తోంది. త్వరలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సీబీఎస్ఈ పాఠశాలలు పెరగనున్న కారణంగా ఏపీలో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం విశేషం.


హెచ్ఎంలకు ఇప్పటికే శిక్షణ ఇచ్చారు



విద్యార్థుల్లో ఉన్న అభ్యసనా సామర్థ్యాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ బోధనకు అనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తున్నాం. సీబీఎస్ఈ సిలబస్ వల్ల పోటీ పరీక్షల్లో విద్యార్థుల్లో మార్పులు చోటుచేసుకుంటాయి. ఇప్పటివరకూ కార్పొరేట్ పాఠశాలల్లోనే సీబీఎస్ఈ అందుబాటులో ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రుల్లో అపోహ ఉంది. రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లోనూ సీబీఎస్ఈ విధానం అమలవుతుండడంతో తల్లిదండ్రుల్లోనూ ఆనందం కనిపిస్తోంది. ఈ సిలబస్‌పై ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. త్వరలో ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు.

– పెద్దిరాజు, బిఆర్ఎంవి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాలకొల్లు

బొప్పాయి.. బడాయి



ఆకులు ఉన్నా రాలిపోయాయో ఏమో గాని ఓ బొప్పాయి చెట్టు ఆకులు లేకుండా కేవలం కాయలతో మాత్రమే కనిపిస్తూ పలువురిని ఆకట్టుకుంటోంది. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం, పందిరిమామిడిగూడెం గ్రామాల మధ్య రహదారి పక్కన సుమారు ఎనిమిది అడుగులు ఉన్న ఒక బొప్పాయి చెట్టు ఇలా ఆకులు లేకుండా కేవలం కాయలు కాశాయి. ఈ చెట్టుకు ఒక్కటే చిన్న ఆకు ఉంది.

– బుట్టాయగూడెం

గుబ్బల మంగమ్మకు ప్రత్యేక పూజలు



గుబ్బల మంగమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం: మండలంలోని కామవరం సమీపంలోని అటవీప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మతల్లి గుడికి ఆదివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలతో పాటు గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భక్తుల రాక సంఖ్య బాగా తగ్గింది. అతితక్కువ సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

ఏలూరు టౌన్: నగరంలోని గన్‌బజార్ సెంటర్ మసీదు ప్రాంతంలో రైలు పట్టాలు దాటుతుండగా గూడ్స్ రైలు ఢీకొనటంతో ఓ గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి వయస్సు సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండవచ్చని, 5.4 అడుగుల ఎత్తు, కోలముఖం, తెలుపు రంగు గడ్డం కలిగి ఉన్నాడు. లేత బిస్కెట్ రంగు పొడవుచేతుల చొక్కా, ముక్కుపొడుం రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 94406 27572 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఏలూరు రైల్వే ఎస్ఐ డి.నరసింహారావు కోరారు.

ఏప్రిల్ 28 నుంచి కొంతేరులో నాటక పోటీలు

పాలకొల్లు అర్బన్: కొంతేరు యూత్ క్లబ్ వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అఖిల భారత స్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ చెప్పారు. ఆదివారం యూత్ క్లబ్ కళామందిర్ ఆవరణలో క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నాటిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీలకు సహాయ, సహకారాలు అందిస్తున్న కళాకారులు, కళాపోషకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సమావేశంలో తీర్మానించారు. యూత్‌క్లబ్ కార్యదర్శి గంటా ముత్యాలరావు నాయుడు, ఉపాధ్యక్షులు బోణం రవిబాబు, జక్కంశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి అంబటి నవీన్‌చంద్, సమన్వయకర్త జవ్వాది శ్రీనివాసుల నాయుడు, బోడపాటి రాజశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి



హశ్వంత్‌బాబు మృతదేహం

కొయ్యలగూడెం: గుర్తు తెలియని వాహనం ఢీకొని సచివాలయ ఉద్యోగి ఆదివారం రాత్రి మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం మండలం తిరుమలదేవిపేట సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా వై.హశ్వంత్‌బాబు విధులు నిర్వహిస్తున్నాడు. కొయ్యలగూడెం, బయ్యన్నగూడెం జాతీయ ప్రధాన రహదారిపై నీలాలమ్మ గుడి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో హశ్వంత్‌బాబు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇతని స్వస్థలం టి.నరసాపురం మండలం బొర్రంపాలెం కాగా, గత కొద్ది కాలంగా జంగారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీజే విష్ణువర్ధన్ చెప్పారు.

బీసీల కులగణన సమగ్రంగా చేపట్టాలి

- బీసీ చైతన్య వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్
- బీసీల కులగణన అంశంపై ఏలూరులో రౌండ్ టేబుల్ సమావేశం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): బీసీల కులగణనను సమగ్రంగా నిర్వహించాలని బీసీ చైతన్య వేదిక ఉభయ తెలుగు రాష్ట్రాల అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ కోరారు. స్థానిక ప్రశాంతి వాకర్స్ అసోసియేషన్ హాలులో బీసీల కులగణన అంశంపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో బీసీల కులగణన జరగకపోవటం వల్ల 54 శాతం జనాభా ఉన్న బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కేవలం 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఇదే సమయంలో కేవలం 15 శాతంగా ఉన్న ఓసీ జనాభాకు 10 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం 1931లో నాటి బ్రిటీష్ గవర్నమెంట్ బీసీల జనగణన నిర్వహించిందన్నారు. నాటి నుంచి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు అయినా బీసీ కులగణన సమగ్రంగా నిర్వహించలేదన్నారు. బీసీ కులగణనకు అనుకూలంగా దేశంలోని 13 రాష్ట్రాలు ఆయా అసెంబ్లీలలో తీర్మానం చేశాయని గుర్తు చేసారు. ఇదే సమయంలో బీహార్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి బీసీ కులగణన నిర్వహించేందుకు రూ.550 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించే జనాభా లెక్కల్లో బీసీ కులాల గణనను సమగ్రంగా లెక్కించాలని కోరారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో త్వరలో బీసీ సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల నాయకులు లక్కోజు రాజగోపాలాచారి, లంకా వెంకటేశ్వర్లు, ఘంటసాల వెంకటలక్ష్మి, చనుమోలు అశోక్ గౌడ్, ఉక్కుసూరి గోపాలకృష్ణ, కోడి దుర్గారావు, వీరవల్లి వెంకటేశ్వరరావు, గుత్తుల బాల త్రిపుర సుందరి, త్రినాథ్ ఫ్యాషన్స్ అధినేత శలా రాజబాబు, కూనా కృష్ణారావు, ఎస్‌పీఆర్ విఠల్, ఏసురాజు పాల్గొన్నారు.

22 నుంచి ఉగాది నాటికలు, నృత్యోత్సవాలు



ఉత్సవాల బ్రోచర్ విడుదల చేస్తున్న బుద్దాల వెంకట రామారావు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భారతీయ విద్యాభవన్స్, ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సహకారంతో ఈ నెల 22 నుంచి 27వ తేదీ వరకు తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రంలో స్వర్గీయ గుండుమోగుల కృష్ణారావు, ఆదిలక్ష్మి దంపతుల స్మారక 30వ జాతీయస్థాయి ఉగాది నాటికలు, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీవీఆర్ వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు చెప్పారు. కళాకేంద్రంలో నాటిక, నృత్యోత్సవాల బ్రోచర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22న సాయంత్రం పంచాంగ పఠనం, ఉగాది విశిష్ట సేవా పురస్కారాలు, అవార్డుల ప్రదానం, నాట్య ప్రదర్శన, 23న సాయంత్రం తల్లాప్రగడ రామకృష్ణ శాస్త్రితో రామాయణ కావ్య విశేషాలపై ఆధ్యాత్మిక ప్రవచనం, నృత్య, 'పక్కింటి మొగుడు' నాటిక ప్రదర్శనలు ఉంటాయన్నారు. అలాగే 24 సాయంత్రం, నాట్య ప్రదర్శనలు, అవార్డుల ప్రదానం, వృద్ధ కళాకారులకు ఆర్థిక సాయం, 'మృత్యుపత్రం', 'మనసున మనసై' నాటిక ప్రదర్శనలు, 25న సాయంత్రం జానపద నృత్యాలు, 'కొత్త పరిమళం', 'ప్రక్షాళన' నాటికలు, 26న సాయంత్రం కూచిపూడి నృత్యప్రదర్శనలు, 'ప్రేమతో నాన్న', 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికలు, 27న సాయంత్రం 'ఉషా పరిణయం' పౌరాణిక పద్య నాటకం, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. బ్రోచర్లు విడుదల చేసిన వారిలో పేరిచర్ల మురళీకృష్ణంరాజు, సరస్వతుల హనుమంతరావు, కొడవటిగంటి వెంకట నరసింహాచార్యులు, ఎం.వెంకన్న, ఆళ్ల శ్రీనివాస్, కె.శ్రీనివాస్, దాసరి కాశీ విశ్వనాథం, విజయకిషోర్ పాల్గొన్నారు.

పిట్ట కొంచెం.. మనుగడ గగనం

- పర్యావరణ సమతుల్యతలో కీలక భూమిక
- సరైన ఆవాసాలు లేక క్రమంగా కనుమరుగు
- కృత్రిమ గూళ్ల ఏర్పాటుతో సంతతి వృద్ధి అవుతుందంటున్న పిచ్చుక ప్రేమికులు

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

జంగారెడ్డిగూడెం/ఆకివీడు: పర్యావరణ సమతుల్యతలో పిచ్చుకలు కూడా కీలక భూమికను పోషిస్తున్నాయి. అటువంటి పిచ్చుకలు నేటి వాతావరణ, సామాజిక పరిస్థితులు దృష్ట్యా అంతరించే జాతుల్లోకి చేరుతున్నాయి. వీటికి సరైన ఆవాసాలు లేక క్రమేపీ కనుమరుగయ్యే స్థితికి చేరుకుంటున్నాయి. పట్టణాలు కాంక్రీట్ వనాలుగా మారితే, పల్లెల్లో పచ్చదనం తరిగిపోతోంది. ఈ నేపథ్యంలో అద్భుత నిర్మాణాలుగా భాసిల్లే పిచ్చుక గూళ్లు ఇప్పుడు కనిపించడమే గగనంగా మారింది. ఇక సంప్రదాయ పంటల స్థానే వాణిజ్య పంటలు పండించడం కూడా పిచ్చుకల సంఖ్య తగ్గడానికి ఓ కారణంగా చెబుతున్నారు. అలాగే ప్రస్తుత వాతావరణం, రేడియేషన్ ప్రభావంతో పిచ్చుక జాతి అంతరించిపోతుందనే వాదన ఉంది. వీటిని భవిష్యత్ తరాలకు అందించేలా ప్రతి ఒక్కరూ వాటికి కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేసి పిచ్చుకల సంతతి అభివృద్ధికి కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందంటున్నారు పలువురు పిచ్చుకల ప్రేమికులు. సోమవారం పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వాటి సంతతి వృద్ధికి వారు చేస్తున్న కృషిని తెలుసుకోవడంతో పాటు మనమూ ఆచరించే ప్రయత్నం చేద్దాం.



గింజల్ని తింటున్న పిచ్చుకలు

పర్యావరణానికి మేలు

పర్యావరణం, పంటలకు మేలు చేసే పిచ్చుకలను రక్షించుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ చేపట్టాలి. పిచ్చుకల ఆవశ్యకతను గుర్తించి అవగాహన పెంపొందించుకోవాలి. నా వంతు బాధ్యతగా కృత్రిమంగా గూళ్లను తయారు చేసి పిల్లలకు ఉచితంగా అందిస్తున్నాను. ఇప్పటికే కుప్పనపూడి గ్రామంలో 30 గూళ్లు, భీమవరం ప్రాంతంలో 20 గూళ్లు, ఉండిలో 8 గూళ్లను ఉచితంగా అందజేశా. దీనిపై పాఠశాలలో కార్యక్రమాలను నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నా.

– నిమ్మతి కృపానందం, ఉపాధ్యాయుడు, అయిభీమవరం హైస్కూల్, పిచ్చుకల ప్రేమికుడు



కృత్రిమ పిచ్చుక గూళ్లతో ఉపాధ్యాయుడు కృపానందం

కృత్రిమ గూళ్లతోనే సంతతి వృద్ధి



2014 నుంచి పిచ్చుకల సంతతి వృద్ధి చేసేందుకు నా వంతు కృషి చేస్తున్నా. సెల్ టవర్ రేడియేషన్ వల్లే ఇవి అంతరించే దశకు చేరుకుంటున్నాయని మొదట్లో భావించా. దీనిపై ఐదేళ్ల పరిశోధన చేశా. కేవలం ఆవాసాలు తగ్గడం వల్లే వీటి సంఖ్య తగ్గుతోందని గుర్తించా. దీంతో పిచ్చుకలకు కృత్రిమ ఆవాసాలు కల్పించాలని నిర్ణయించుకున్నా. ఇప్పటివరకు జంగారెడ్డిగూడెంలో మొత్తం 690 కృత్రిమ గూళ్లు ఏర్పాటు చేశా. 97 శాతం వీటిని ఆవాసంగా చేసుకుని వాటి సంతతిని వృద్ధి చేసుకుంటున్నాయి. అప్పట్లో వీటి సంఖ్య కేవలం 47గా గుర్తించగా, ప్రస్తుతం వీటి సంఖ్య 2093కు పెరిగింది. కృత్రిమ గూళ్ల ఏర్పాటుతోనే ఇది సాధ్యమైంది. అలాగే సెల్ టవర్ రేడియేషన్ ప్రభావం ఏ మేరకు ఉందో పరిశీలించేందుకు 300 గూళ్లను ఎంపిక చేసి, రెండు సెల్ టవర్ల నుంచి వివిధ దూరాలలో రేడియేషన్ తీవ్రత, పిచ్చుకల మనుగడ, ప్రత్యుత్పత్తిపై పరిశీలన చేశాం. వీటిపై ఎలాంటి రేడియేషన్ ప్రభావం కనిపించలేదు. పిచ్చుకల సంతతిని వృద్ధి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– వీరా మహేష్, పిచ్చుక ప్రేమికుడు

క్లుప్తంగా

ఉచిత మెగా వైద్యశిబిరం



అత్తిలిలో ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అత్తిలి: కామినేని ఆసుపత్రి, ఇండియన్ డిజిటల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం అత్తిలిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి హాజరైనవారికి బీపీ, సుగర్, ఈసీజీ వంటి పరీక్షలతో పాటు పలు సమస్యలతో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ షేక్ మొహియుద్దీన్ మాట్లాడుతూ స్కూల్ తరపున సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ కామినేని ఆసుపత్రివారి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసామన్నారు. వైద్య శిబిరానికి 500 మంది హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎం అచ్యుతరావు,చ స్కూల్ మేనేజర్ ఎం హరి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 12.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో గడిచిన 24 గంటల్లో 12.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వైకేవీ.అప్పారావు ఆదివారం తెలిపారు. పెంటపాడు మండలంలో 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ తెలిపారు.

వీఆర్వోల సమస్యలపై పనిచేయాలి

తాడేపల్లిగూడెం రూరల్: వీఆర్వోల సమస్యలపై నూతన కమిటీ పనిచేయాలని వీఆర్వోల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఎన్జీవోస్ హోమ్‌లో వీఆర్వో సంఘ డివిజన్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ఆర్.చెల్లయ్య, కార్యదర్శిగా వి.ముత్యాలరావు, కోశాధికారిగా సీహెచ్.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఎం.రామోజీ, కేవీవీ.సుబ్బారావు, ఎస్.అనూష, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.ప్రభువరం, ఎ.శ్రీనివాస్, జి.లలితకుమారి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వెంకటేష్, వై.రాజు, విజె.కెనడి, కార్యవర్గ సభ్యులను ఆరు మండలాల నుంచి వచ్చిన అధ్యక్ష, కార్యదర్శులు, వీఆర్వోలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు కె.రాంబాబు, నాగరాజు, ఆర్.పోతురాజు, సురేష్, దేవరాజు, అత్తిలి మండల వీఆర్వోలు కొండబాబు, నాగభూషణం, రామకృష్ణ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: పేకాట శిబిరంపై దాడి చేసి, ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై పీఎస్.వీరభద్రరావు తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముందస్తు సమాచారం మేరకు ఎల్.అగ్రహారం రాజీవ్ గృహకల్ప సముదాయంలో రూరల్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.20,100 నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు వివరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జాన్సన్ దంపతులకు ఘన సత్కారం

భీమవరం(ప్రకాశం చౌక్) : పట్టణంలోని మన్నా చర్చ్ వద్ద ఆదివారం రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు మేడిది జాన్సన్, ప్రియాంక దంపతులను ఘనంగా సత్కరించారు. సంఘం, యూత్, స్త్రీల సమాజం, సండే స్కూల్ తరపున జాన్సన్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా చర్చ్ కాపరి బిషప్ ఎం.దేవదాసు మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా మేడిది జాన్సన్ చేసిన సేవలను కొనియాడారు. సంఘ పెద్దలు, యూత్, విశ్వాసులు పాల్గొన్నారు.

సీపీఎం తొలితరం నాయకులకు నివాళి

సాక్షి, భీమవరం : సీపీఎం పార్టీ తొలితరం నాయకులు ఇ.ఎం.ఎస్ నంబుద్రిపాద్, తెలంగాణా సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రధమ వర్ధంతి కార్యక్రమం మెంటే వారితోట సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం నిర్వహించారు. నాయకుల చిత్రపటాలకు సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957లో దేశంలో మొట్ట మొదటిసారిగా ప్రజాస్వామ్యయుతంగా ఓట్ల ద్వారా గెలుపొందిన తొలి ముఖ్యమంత్రి ఇం.ఎస్.నంబుద్రిపాద్ అని అన్నారు. అలాగే ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో మల్లు స్వరాజ్యం నిజాం పాలనను వ్యతిరేకించి శ్రామికులు, కూలీల విముక్తి కోసం తుపాకి పట్టి పోరాడిన యోధురాలని కొనియాడారు. కార్యక్రమంలో జేవీవీ గోపాల్, బి.వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, ఎం.వైకుంఠరావు, మల్లిపూడి ఆంజనేయులు, ఎస్‌కే వలీ, బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ఆప్షన్-3 గృహ నిర్మాణాలు

- ఆర్థిక స్తోమత లేని లబ్ధిదారులకు అండగా ప్రభుత్వం
- అధికారులు పర్యవేక్షణలో ఇళ్ల నిర్మాణం
- ఉగాది నాటికి లక్ష్యం పూర్తి చేసేలా పర్యవేక్షణ



కోనాలలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

తణుకు టౌన్: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో తణుకు మండలంలోని జగనన్న కాలనీల్లో ప్రభుత్వం అందించిన స్థలంలో ఇళ్ల సొంతంగా నిర్మించుకోలేని పేదలకు ప్రభుత్వం చేపట్టిన ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణం శరవేగంగా నిర్మాణాలు సాగుతున్నాయి. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తణుకు ప్రాంతంలో సొంతిల్లు ఉండాలనే పేదల కోరిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా నెరవేరింది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లో 24 లేవుట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 3,021 మందికి ఇళ్ల స్థలాలు అందజేశారు. ఇప్పటి వరకూ ప్రభుత్వం నిర్దేశించిన ఆప్షన్లు 1, 2లో లబ్ధిదారులు సొంత నిధులు కలిపి ఇళ్ల నిర్మించుకున్నారు. నిరుపేదలైన కొంతమంది తగిన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్ట లేదు. దీంతో ప్రభుత్వం అధికారుల పర్యవేక్షణలో ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణం చేపట్టింది. రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, కలెక్టర్ పి ప్రశాంతి ఇళ్ల నిర్మాణ ప్రగతిని నిరంతర పర్యవేక్షిస్తున్నారు. తణుకు మండలంలో ఆప్షన్ 3 ద్వారా మొదటి విడతగా 300 ఇళ్ల నిర్మాణాన్ని ఈ సంవత్సరం ఫిబ్రవరి ప్రారంభించారు. ఉగాది నాటికి ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆప్షన్ 3లో చేపట్టిన ఇళ్లలో 140 ఇళ్లు ప్లింత్ బీమ్‌ల స్థాయికి, 133 బేస్‌మెంట్ స్థాయికి, 8 ఇళ్లు గుమ్మం ఎత్తు స్థాయికి, 7 రూఫ్‌స్థాయికి, 7 ఇళ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయి. లేవుట్ స్థాయి, గ్రామస్థాయి, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించి ఇళ్ల నిర్మాణ ప్రగతిని పర్యవేక్షిస్తున్నారు. దీనికి ప్రతి బుధవారం, శనివారాల్లో గ్రామ స్థాయి, మండల స్థాయిలో సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నారు. శనివారం గ్రామాల్లోని లేవుట్ల వద్ద లబ్ధిదారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. గృహ నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలతో పాటు జగనన్న కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, తాగు నీరు వంటి మౌలిక వసతుల సమస్యలను పరిష్కరిస్తున్నారు.

పూరి గుడిసె నుంచి సొంతింటిలోకి



కోనాల గ్రామంలోని కోనాల, ఆరుళ్ల రోడ్డు మార్జిన్‌లో పూరి గుడిసెలో నివసించే మాకు జగన్నన్న కాలనీలో సొంతింటి స్థలం మంజూరైంది. ప్రభుత్వ సాయంతోపాటు డ్వాక్రా సంఘం ద్వారా అందించిన ఆర్థిక సహాయంతో ఆప్షన్ 3లో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ఆరుగురు కుటుంబ సభ్యులతో గుడిసెలో ఎంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆప్షన్ 3 ద్వారా ప్రస్తుతం ఇంటి నిర్మాణం స్లాబ్ స్థాయికి వచ్చింది.

– నక్కా వీరమ్మ, జగనన్న కాలనీలో ఆప్షన్ 3 గృహ లబ్ధిదారు

లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించాలి



నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులు రెండేళ్లలో ఇల్లు నిర్మాణం చేపట్టాలి. స్థలం పొందిన 5 ఏళ్ల వరకూ ఈ స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు చెల్లవు, దళారుల మాటలు విని ఎవరైనా కొనుగోలు చేసినా ఇబ్బందులు తప్పవు. జగనన్న లేవుట్లలోని లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకోవాలి.

– పీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, మండల గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి, తణుకు

నాణ్యతతో ఇళ్ల నిర్మాణం



తణుకు మండలంలోని ఆప్షన్ 3లో చేపట్టిన ఇళ్ల నిర్మాణానికి సంబంధించి గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, గ్రామ, మండలస్థాయి అధికారుల సమన్వయం, సహకారం బాగుంది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఇటుక సరఫరా చేసిన అనుభవంతో తణుకు మండలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టా. ఆప్షన్ 3లో నాణ్యతతో ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో ఇక్కడ ఇళ్ల నిర్మాణం చేపట్టా.

– గూడపాటి గోవిందరాజు, ఆప్షన్ 3 గృహ నిర్మాణ ఏజెన్సీ నిర్వాహకులు

ముత్యాలమ్మవారికి వెండి విరాళం



ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి చీరకు వెండి విరాళంగా అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని ముత్యాలంబపురం ముత్యాలమ్మవారి చీర నిమిత్తం తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన లక్ష్మీనరసింహ ఆయిల్, జనరల్ స్టోర్స్ నిర్వాహకులు కొంపెల్ల పురుషోత్తమరావు, సూర్యరత్నం దంపతులు కిలో వెండిని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ మాకా బాలాజీ అభినందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): శ్రీరామ నవమి (ఈ నెల 30వ తేదీ గురువారం) సందర్భంగా భద్రాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం 29వ తేదీ బుధవారం రోజున తాడేపల్లిగూడెం డిపో నుంచి బస్సులు భద్రాచలానికి బయలు దేరుతాయని తెలిపారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఫోన్ నంబర్లు 99855 44411, 99597 53102 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరంలో సీఐ నాగరాజు, క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో దాత లయన్ పదమ్‌కుమార్ గుప్తా సౌజన్యంతో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ నేత్ర వైద్యశాల వారితో ఉచిత కంటి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సీఐ ఎస్ఎస్‌వీ నాగరాజు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సన్నిధి సూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించారు. వైద్య శిబిరంలో 151 మందికి కంటి పరీక్షలు చేశారు. 16 మందిని కంటి శస్త్రచికిత్సలు నిమిత్తం నిడదవోలు ఆసుపత్రికి పంపించారు. 20 మందికి కళ్లజోడ్లు ఉచితంగా అందించేందుకు నిర్ణయించారు. సీఐ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో కోశాధికారి చిన్నం జగదీష్, పేరూరి కాశయ్య, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరా వు, పచ్చ వెంకటేశ్వరరావు, మదన్‌మోహన్ అగర్వాల్, జి.హరిబాబు, ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే నిమ్మల ఆరోపణలు హాస్యాస్పదం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా ఎలా ఆహ్వానించింది ఆధారాలతో చూపించినా ఇంకా గవర్నర్‌కు గౌరవం ఇవ్వలేదంటూ ఎమ్మెల్యే నిమ్మల చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదంగా ఉన్నాయని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం తాతాజీ తన కార్యాలయంలో విలేకరుతో మాట్లాడుతూ తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ గురించి మాట్లాడుతున్న రామానాయుడు ఆ ఓబీసీ సర్టిఫికెట్‌ను ఎవరు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2008లో వైఎస్ రాజశేఖరరెడ్డి తూర్పుకాపులు ఉత్తరాంధ్రలోనే కాదని ఎక్కడ ఉన్నా ఓబీసీ సర్టిఫికెట్ వర్తించాలనే ఉద్దేశంతో నాడు ప్రత్యేక జీవో జారీచేశారన్నారు. అనంతరం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత 2017లో ఆ జీవోను రద్దు చేశారని గుర్తు చేశారు. మరి నాడు అధికారంలో ఉండగా మాట్లాడలేని రామానాయుడు ఈ రోజు ప్లకార్డులు పట్టుకుని తూర్పుకాపుల ఓబీసీ సర్టిఫికెట్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. 2018లో గృహ లబ్ధిదారులకు పత్రాలు ఇచ్చి బ్యాంకుల్లో రుణాలు చేయించి అప్పుల పాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, బెజ్జవరపు నాగరాజు, పిల్లా శ్రీను, జోగి వడ్డికాసులు, కాపిశెట్టి శ్రీను, జోగాడ ఉమామహేశ్వరరావు, రేలంగి శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ముఖదారమ్మ ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అచ్చుగట్లపాలెం చిత్రావి చెరువు గట్టున కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 22వ తేదీ ఉగాది నుంచి 28 వరకూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో కమిటీ సభ్యులు అమ్మవారి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 22న ఉగాది నాడు పుట్టింటి వారితో, 23న కమిటీ వారిచే రెండు రోజులు అమ్మవారి జాతర మహోత్సవాలు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు మండెల రజనీ, సెక్రటరీ కుంపట్ల రాజా, ట్రెజరర్ చెక్కా కృష్ణ, సిహెచ్. గణపతి, కె.నాగేశ్వరరావు, ఆర్.శ్రీరామచంద్రమూర్తి, సీహెచ్ సుబ్రహ్మణ్యం, వి శ్రీనివాసరావు, కాశీ, బాబీ, ఎ.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



మట్టపర్రు మాజీ సర్పంచ్ తంగెళ్ల పురుషోత్తం కుమారుడుకి రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ విజేత కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఆరోగ్యశ్రీ వర్తించని అనేక మంది రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందిస్తూ ఆ కుటుంబాలను ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్, ఎమ్మెల్సీ విజేత కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పోడూరు మండలం మట్టపర్రు గ్రామ మాజీ సర్పంచ్ తంగెళ్ల పురుషోత్తం కుమారుడు శంకర శ్రీనివాస్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషోత్తం కుటుంబానికి ఏ అవసరం ఉన్నా పార్టీ తరపున ఆదుకుంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోడూరు ఎంపీపీ సబ్బితి సుమంగళి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ గుంటూరు పెద్దిరాజు, పార్టీ మండల కన్వీనర్ కలిదిండి గణపతిరాజు, వైఎస్ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, గ్రామ పార్టీ నాయకులు కొల్లాబత్తుల రవిబాబు, కుసుమ శుభాకర్, నేలపాటి రత్నరాజు, పెచ్చెట్టి ముత్యాలు, జుత్తిగ పెద్దిరాజు, వాస్కూరి లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గానికి సత్కారం



డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజును సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం : స్థానిక డీఎన్నార్ కళాశాల అసోసియేషన్ నూతన పాలకవర్గ సభ్యులను పట్టణంలోని చంద్రిక ఫంక్షన్ హాల్లో ఆదివారం భీమవరం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు అధ్యక్షతన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరసింహరాజు మాట్లాడుతూ పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయన్నారు. దంతులూరి నారాయణరాజు ఆశయాలకు అనుగుణంగా కళాశాల అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కార్యదర్శి గాదిరాజు బాబు మాట్లాడుతూ వాకర్స్ కోసం ప్రత్యేకంగా గ్రౌండ్స్‌ను ఏర్పాటు చేశామని, కళాశాల యాజమాన్యం తరపున వారికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

ఇరగవరం: ప్రభుత్వ పథకాలు ప్రచారం చేస్తూ ముందుకు వెళ్లాలని తణుకు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పొట్ల సురేష్ అన్నారు. ఆదివారం ఇరగవరం మండల ఎస్సీ సెల్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర పౌర సరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నియోజక అభివృద్ధికి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయాలతో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేస్తున్నారు. ఆయనకు అందరూ మద్దతు తెలపాలన్నారు. దానికి అనుగుణంగా వైఎస్సార్ సీపీ నాయకులు పనిచేయాలని కోరారు. అధికారులు ఎస్సీల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేయాలని మండల ఎస్సీ నాయకులకు పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇకపై ప్రతి గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోగి బాబీ, జాలి సుబ్బారావు పాల్గొన్నారు.

సంచార వైద్యశాలతో 10 మందికి వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో 10 మందికి ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు బొండాడ వెంకటేశ్వర్లు తణుకు పాతూరు, తణుకు పట్టణం, హౌసింగ్ బోర్డు కాలనీ, వేల్పూరు, గ్రామాల్లో పర్యటించి మంచానికే పరిమితమైనవారి వద్దకు వెళ్లి వైద్యపరీక్షలు నిర్వహించి సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా రోగులకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు. తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ప్రతినెల 3వ ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో భాగంగా ఆదివారం అసోసియేషన్ భవనం వద్ద 30 మందికి బీపీ, సుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి రిపోర్టుల ప్రకారం ఉచిత వైద్య సలహాలు, సూచనలు అందించినట్లు తెలిపారు. తణుకులోని సాయి స్వేతా డయోగ్నస్టిక్ సెంటర్ ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ల్యాబ్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



అత్తిలిలో చిత్రలేఖన పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: ఉగాది సందర్భంగా అమర్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఆదివారం అత్తిలిలో సీనియర్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ ప్రముఖులు దామిశెట్టి బాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తమకు ఇష్టమైన కళలపై పట్టు సాధించాలన్నారు. రిలయన్స్ మార్కెటింగ్ మేనేజర్ పి వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లోఉన్న సృజనాత్మకతను వెలికితీస్తున్న అమర్ ఆర్ట్స్ అకాడమీ వారికి అభినందనలు తెలిపారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు మరెన్నో చేయాలని కోరారు. చిత్రలేఖన పోటీలో సీనియర్ విభాగంలో వి తేజ, టి కీర్తన, కె దీపికా, జూనియర్స్ విభాగంలో ఎంవీ కావ్యాంజలి, ఎ మనశ్వని, కె శిరీషా మొదటి మూడు స్థానాలు సబ్ జూనియర్స్ విభాగంలో బి గ్రీష్మశ్రీ, సోనాక్షి మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. వీరికి దామిశెట్టి బాబు చేతుల మీదుగా బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో డ్రాయింగ్ ఉపాధ్యాయులు వి విజయ్, పి ఏడుకొండలు, ఉపాధ్యాయిని రమణి పాల్గొన్నారు.

సువార్త బోధకులపై దాడి హేయమైన చర్య



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి ఆనంద్

పెంటపాడు: సువార్త పరిచర్య చేసే బోధకులపై మతోన్మాదులు దాడి చేయడం హేయమైన చర్య అని రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు, యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జే.జ్యోతి ఆనంద్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని కొండయ్య చెరువు వద్ద ఫెయిత్ చర్చ్ ఆవరణలో ఆదివారం క్రైస్తవ సంఘం నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గం కాశీపాడులో ఏసుక్రీస్తు సువార్త బోధకులపై కొందరు మతోన్మాదులు దాడి చేశారన్నారు. సామగ్రి, మైక్‌లు ధ్వంసం చేయడం, అన్యాయంగా కేసులు పెట్టి హింసించడం జరిగిందన్నారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గాదిరాజు సుబ్బరాజుకు తెలియజేసినట్లు వెల్లడించారు. దీనిపై వారు జోక్యం కలుగజేసుకొని క్రైస్తవులకు అండగా నిలివడంపై వారికి జ్యోతి ఆనంద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూపీఏ జనరల్ సెక్రటరీ ఆనంద బాబు, నియోజకవర్గ సెక్రటరీ సామ్యూల్ రాజు, పాస్టర్ ఎలీషా, ఉంగుటూరు యూపీఏ చైర్మన్ ఉండ్రాజవరపు రాజు, ఏలూరు జిల్లా సంయుక్త కోశాధికారి సాల్మన్‌రాజు, ఎం.ఐజాక్‌రాజు, పట్టణ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలంతా అండగా నిలవాలి



శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుని కలిసిన వైఎస్సార్ సీపీ వీరవాసరం ఎస్సీ సెల్ నాయికులు

వీరవాసరం : శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుని వైఎస్సార్ సీపీ వీరవాసరం ఎస్సీ సెల్ విభాగం మండల శాఖ నాయకులు ఆదివారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ ఎస్టీలంతా అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ నేతల జ్ఞాన సుందరరాజు, కాటం స్టాన్లీ రాజు, బొంతు రమేష్, చికెలే మంగతాయారు, చిక్కాల రాజు, గోడి షణ్ముఖరావు, సంద్రమళ్ల శ్యాంబాబు, పత్తుల సాల్మన్ రాజు, పత్తుల టైసన్, గడ్డం మునలయ్య, వెంపళ్ల నరసింహమూర్తి, దేవ రాంబాబు, ప్రసాద్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

తాడేపల్లిగూడెం అర్బన్ : ఆరోగ్య శాఖలో 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని ఏపీ కో సేవా రాష్ట్ర అధ్యక్షుడు లంకా మణికాంత్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, స్టాఫ్‌నర్స్, ఎల్‌టీలతో సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కారుణ్య నియామకాలను వర్తింపచేయాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన కాంట్రాక్ట్ ఉద్యోగులకు రూ.20 లక్షలు, తీవ్ర గాయాల పాలైన సిబ్బందికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా వర్తింప చేయాలని విన్నవించారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు సీరం రమేష్, నూతక్కి వీరవెంకటరాజు, కిలారి రామకృష్ణ, శిరిగినీడి సాయిసూర్యారావు, వెంపలి వీర వెంకటరాజు, బీవీ భాస్కర్, పెదపోలు పృధ్వీ తదితరులు హాజరయ్యారు.

పరీక్ష సామగ్రి అందజేత

సాక్షి, భీమవరం : పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలకు సిద్ధం కావాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ప్రభుత్వ బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక అధ్వర్యంలో ప్రభుత్వ బీసీ హాస్టల్లో పదో తరగతి విద్యార్థులు పరీక్షలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. హాస్టల్ వార్డెన్ కుసుమ కుమారి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అరగంట ముందే పరీక్ష హాల్‌కు చేరుకోవాలని, ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివి రాయాలని, అన్ని జాగ్రత్తలు అవసరమని అన్నారు. అరసవల్లి ట్రస్ట్ చైర్మన్ అరసవల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.